క్లుప్తంగా

రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి


పనుల వివరాలు తెలుసుకుంటున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్

మహానంది: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసే పనులకు సంబంధించి రికార్డుల నిర్వహణకు పకడ్బందీగా చేపట్టాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ తెలిపారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద రోడ్డు అవెన్యూ పనులకు సోమవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ఉపాధి హామీ పథకం కార్యాలయానికి చేరుకుని ఏపీఓ వసుధారెడ్డితో పలు అంశాలపై చర్చించి రికార్డులను పరిశీలించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

వెలుగోడు: ప్రతి కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని తహసీల్దార్ విజయకుమారి, ఏఓ పవన్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో వారు సమావేశం నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డు వల్ల కౌలు రైతుకు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చని, పంట నమోదు చేసుకుని పంట బీమా పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం, దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన


కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన సంస్కృత కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. గణేశ పంచరత్నం, కాలభైరవాష్టకం, అయిగిరినందిని, శివస్తుతి, భో..శంభో శివ శంభో, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం, బ్రహ్మాంజలి తదితర గీతాలకు, అష్టకాలకు కావ్య, ప్రతిక, అశ్రిత, సహస్ర, వర్షిణి, అభిశ్రీ, ఆరాధ్య, అద్వైత, మేఘన, మమత, అంజలి, రవలి, సాహిత్య, శ్రావణి, లక్ష్మీ సహస్ర తదితరులు నృత్యాలను ప్రదర్శించారు.

నాగన్న కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఇరవై రోజుల క్రితం అతిసార వ్యాధితో మృతిచెందిన చాబోలు గ్రామానికి చెందిన నడిపి నాగన్న కుటుంబానికి అధికారులు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే ఇవ్వాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ ఎం.దాసును మృతుని సోదరుడు నాగన్నతో కలిసి వినతిపత్రం అందజేశారు. నడిపి నాగన్న కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు ఇంటి స్థలం, ఐదు ఎకరాల పొలం కేటాయించాలని కోరారు. కొత్త సిద్దేశ్వరంలోని చెంచులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఎల్లాల గ్రామానికి చెందిన బాలిక ఆచూకీని కనిపెట్టాలని కోరారు.

వర్షం కోసం..


నాభి శిలకు జలాభిషేకం చేస్తున్న దృశ్యం

పాములపాడు: వర్షం కోసం పాములపాడులో సోమవారం ప్రజలు దేవతామూర్తుల విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. పలువురు యువకులు తప్పెట్లతో వినాయక, ఈశ్వర, ఆంజనేయ, వెంకటేశ్వర తదితర దేవతామూర్తులకు 501 బిందెలతో నీటిధారలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణుడు కరుణించాలని వేడుకున్నారు.

బాబూ.. నాలుక మడతేసేరు!

➤ఎన్నికల ముందు: ఇరవై లక్షల ఉద్యోగాలు రావాలంటే.. మరోసారి బాబు రావాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరికీ నెలనెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి అందుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి'. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు.

➤ప్రభుత్వం ఏర్పాటై నెలన్నరవుతున్నా..కొత్త ఉద్యోగాల సృష్టి దేవుడెరుగు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 'నిరుద్యోగ భృతి'పై నెల రోజులైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపడం లేదు.

➤పై రెండు ఘటనలను చూస్తుంటే నమ్మి ఓట్లేసిన నిరుద్యోగులకు పలు అనుమానాలు కలుగుతున్నాయి. కొందరైతే తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తనయుడు లోకేష్ ఊరూరా తిరుగుతూ తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల చొప్పున భృతి అందజేస్తామని చెబుతూ కరపత్రాలు కూడా పంచి ఇప్పుడు ఆ అంశాన్నే ఎత్తడం లేదని మండిపడుతున్నారు. ఏమైనా నాలుక మడతేస్తారా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



- నిరుద్యోగ భృతి ఊసెత్తని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న నిరుద్యోగ యువత
- వెంటనే అమలు చేయాలని డిమాండ్

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో డిగ్రీ, పీజీ, బీఈడీ, పీహెచ్‌డీతో పాటు బీటెక్ లాంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు వేల మంది ఉన్నారు. వీరిలో చాలామంది పలు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు. నోటిఫికేషన్లు పెద్దగా విడుదల కాకపోవడంతో కనీసం తమకు నిరుద్యోగభృతి అయినా కాస్త ఊరట కలిగిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. తల్లిదండ్రులు కష్టపడి ఇంతవరకు చదివించారని, ఇకపై వారి వల్ల కావడంలేదని అందుకే ప్రభుత్వమే నిరుద్యోగ భృతి ఇచ్చి తమను ఆదుకోవాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంలో 12,976, ఆత్మకూరు మండలంలో 11,987, శ్రీశైలంలో 9,111, వెలుగోడులో 13,245, మహానంది మండలంలో 12,851, బండిఆత్మకూరు మండలంలో 16,594 మంది నిరుద్యోగులు నిరుద్యోగభృతి కోసం ఎదురుచూస్తున్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



2017లో బీకాం కంప్యూటర్స్ పూర్తి చేశాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో బీటెక్ మధ్యలోనే ఆపేశారు. వివిధ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నా. చంద్రబాబు ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి ఇస్తాననన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇవ్వాలి. ఇంకా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం తగదు.

– అరీఫ్, నిరుద్యోగి, సిద్ధపల్లి రస్తా ఏరియా, ఆత్మకూరు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను 2009లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఇప్పటికి నాకు 35 ఏళ్లు. ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నా. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు భృతి ఇస్తానన్నందుకే ఓటేశాం. నెలన్నర అవుతుంది. ఇంకా విధివిధానలు రూపొందించలేదు. ఇప్పటికైనా త్వరగా భృతి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– యలమంచి ప్రతాప్, నిరుద్యోగి, సున్నిపెంట గ్రామం.

గతంలో మాదిరిగా మోసం చేయొద్దు



నిరుద్యోగ భృతి ఇస్తానని గతంలో ఒక సారి చంద్రబాబు మోసం చేశారు. నాలుగున్నరేళ్లు ఆ ఊరే ఎత్తకుండా చివరలో అది కూడా కొందరికీ భృతి ఇచ్చి మాలాంటి చాలా మందిని మోసం చేశారు. ఇప్పుడైనా ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. ఇప్పటికే నెలన్నర రోజులైంది. వెంటనే నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– డాలు జయచంద్ర, నిరుద్యోగి, దామగట్ల

భృతి ఇచ్చి ఆదుకోవాలి



నేను 2016లో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబునాయుడు మాట ఇచ్చారు. మాట ప్రకారం నాతో పాటు ప్రతి నిరుద్యోగికి ఎలాంటి కండీషన్స్ లేకుండా నిరుద్యోగ భృతిచెల్లించాలి. ఆ డబ్బులతో మెటీరియల్స్ కొనుగోలు చేసి, పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతాం. ఆలస్యం చేయుండా నిరుద్యోగ భృతికి సంబంధించి గైడ్‌లెన్స్ విడుదల చేయాలి.

– రాజన్న, నిరుద్యోగి, జూపాడుబంగ్లా

నోటిఫికేషన్లు విడుదల చేయాలి



నేను బీకాం డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగాలు లేక చేపలు పట్టే వృత్తిని ఎంచుకొని కుటుంబానికి అండగా ఉంటున్నాను. ప్రభుత్వ నిరుద్యోగ భృతి ఇస్తే మాలాంటోళ్లకు చేదోడుగా ఉంటుంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రతిపోస్టును భర్తీచేసేలా నోటీఫికేషన్లు విడుదల చేయాలి. ఎటువంటి నిబంధనలు లేకుండా భృతి ప్రకటించి మాలాంటి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– లింగస్వామి, నిరుద్యోగి, పాములపాడు

ఉద్యోగావకాశాలు కల్పించాలి

నేను బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్దే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. లేక నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– సిసింద్రి, నిరుద్యోగి, మిడుతూరు

దంచి కొట్టిన వాన

- దారులన్నీ జలమయం

కొత్తపల్లి: మండలంలో వాన దంచి కొట్టింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. పొలాలు నీటితో నిండిపోయాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరి సాగు చేసుకున్న రైతుల కళ్లలో ఆనందం నెలకొంది. కాగా మొక్కజొన్న, పత్తి రైతులు మాత్రం పైర్లు దెబ్బతింటాయని భయాందోళన చెందుతున్నారు.

● జూపాడుబంగ్లా: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన ఎడతెరిపి లేకుండా కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా కేజీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వానం వల్ల 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు.


కొత్తపల్లిలో సీసీ రోడ్డుపై వర్షపు నీరు

ఆత్మకూరులో 12.4 మి.మీ. వర్షపాతం

● ఆత్మకూరు: మండలంలోని 12.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాలుగు రోజుల నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ప్రస్తుతం సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలలో సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొక్కజొన్న, కంది పంటలు ఈ వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

గురుకులంలో ఉచిత వైద్యశిబిరం


విద్యార్థులకు చికిత్సలు చేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ పరిధిలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. డెంగీ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వసతిగృహంలోని గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. చేతుల పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాని, దోమకాటు నుంచి కాపాడుకోవాలని విద్యార్థులకు వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. అనంతరం తాగునీటి ట్యాంకును పరిశీలించి క్లోరినేషన్ చేశారు. కార్యక్రమంలో బైర్లూటీ పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, గురుకుల పాఠశాల హెచ్‌ఎం రేఖామణి, పంచాయతీ కార్యదర్శి చాణక్య, సీహెచ్‌ఓ దీపికాబాయి, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ బేబిజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వినతుల స్వీకరణ

జూపాడుబంగ్లా: ప్రజాసమస్యలు–పరిష్కార వేదికలో భాగంగా సోమవారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన బాధితులకు హామీ ఇచ్చిపంపారు. కాగా 80 బన్నూరు గ్రామానికి చెందిన సయ్యద్ బహబూబ్ బాషా తనకు తన పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి ఆన్‌లైన్ ఎక్కించమంటే నెలల తరబడి తిప్పుకుంటున్నారని ఫిర్యాదు చేశాడు.

హెల్మెట్ తప్పనిసరి

నందికొట్కూరు: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పని సరి అని పట్టణ ఎస్‌ఐ వెంకటరమణ వాహనదారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని ఉత్తర్వుల మేరకు ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలంటూ ర్యాలీ నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

మిడుతూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజు సూచించారు. సోమవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు రక్త పరీక్షలు, బరువు, ఎత్తు కొలతలు కొలిచి రికార్డుల్లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ విజయలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూరు: అర్హులైన కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వీఆర్‌ఏ నాగరాజు, బహుళ ప్రయోజన విస్తరణాధికారి ఎస్.రవిగౌడ్, సాయిత్రిబాయి పాల్గొన్నారు.

● పాములపాడు: కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కౌలురైతుల గుర్తింపు కౌలుకార్డుల జారీపై సమావేశం నిర్వహిచారు. కార్యక్రమంలో ఏఓ ఫణీశ్వరరెడ్డి, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సేవలో గోవా మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను గోవా రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విశ్వజిత్ పి రాణే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయనకు అంతకుముందు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు స్వాగతం పలికారు.

పాముకాటుతో మహిళ మృతి

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో గడ్డకింది లక్ష్మిదేవి(37) పాముకాటులో మృతి చెందింది. సోమవారం ఉదయం పొలంలో గడ్డి కోస్తుండగా ఎడమ చేతికి కాటు వేసింది. వెంటనే వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గోంగూర కట్ట కోసం గొడవ

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన జి.అశోక్ ట్రాక్టర్‌లో గోంగూర మోపులను తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నబీ రసూల్ ఓ కట్టను లాక్కున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో నబీరసూల్ తనపై చేయి చేసుకున్నాడని అశోక్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

● గాజులపల్లె గ్రామానికి చెందిన నానిశేఖర్ తనపై అసభ్యంగా ప్రవర్తించినట్లు అదే గ్రామానికి చెందిన మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

● గాజులపల్లె గ్రామానికి చెందిన హసీనా, బంధువుల మధ్య పొలం వద్ద గట్టు విషయంలో ఘర్షణ జరిగినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. హసీనాకు వరుసకు బావలైన గౌస్, మాబాషా గొడవకు దిగి హసీనాకు చెందిన అరటితోటలో చెట్లు నరికి ఆర్థికంగా నష్టం చేకూర్చినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

అనుమానితుడిని పోలీసులకు పట్టించిన గ్రామస్తులు

మహానంది: గాజులపల్లె, బసవాపురం పరిసరాల్లోని పొలాల్లో విద్యుత్ కేబుల్ వైర్లు చోరీలకు గురవుతున్న నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు పంట పొలాల వద్ద సంచరిస్తున్న ఓ యువకుడు దొంగ అనుకుని పట్టుకుని రోడ్‌సేఫ్టీ పోలీసులకు అప్పగించారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు యువకుడిని మహానంది పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టుబడిన యువకుడికి, చోరీలకు ఎలాంటి సంబంధం లేదని, గ్రామస్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే దాడి చేయకుండా పోలీసులకు అప్పగించాలన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

మహానంది: ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓఆర్‌డీ శివనాగజ్యోతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

కౌలు కార్డుల జారీలో జాప్యం వద్దు

కొత్తపల్లి: కౌలు రైతులకు కౌలు కార్డుల జారీలో జాప్యం చేయొద్దని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఏఓ మహేష్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఇతర రైతుల నుంచి పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులను గుర్తించి, కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. కౌలు కార్డులు పొందని పక్షంలో కలిగే నష్టాలను రైతులకు వివరించాలన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం నుంచి అక్రమంగా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.

నకిలీ మందులు కొనుగోలు చేయొద్దు

వెలుగోడు: నకిలీ పురుగు మందులు కొనుగోలు చేయొద్దని ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వేల్పనూరు, రేగడ గూడూరు, వెలుగోడు గ్రామాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన కొందరు వ్యక్తులు కోబ్రా కార్బోఫెరాన్ గుళికలు, నకిలీ పురుగు మందులను ఎటువంటి బిల్లులు, అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

- మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక గవర్నమెంట్ స్కూల్‌లోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై చేస్తుండటంతో తరగతి గదుల్లోకి పొగ చేరి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా వంటమనిషి పద్ధతి మార్చుకోవడం లేదన్నారు. ఉడికీఉడకని అన్నం, నీళ్లలా ఉన్న ఎగ్ కర్రీని విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. వంటగది అపరిశుభ్రంగా ఉందన్నారు. వంటమనిషి తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ లాలుప్రసాద్ ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.


సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

మహానంది: మొహర్రం వేడుకల్లో భాగంగా మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో పండుగ సందడి నెలకొంది. మహానంది మండలంలోని గాజులపల్లె, తిమ్మాపురం, అబ్బీపురం, బుక్కాపురం, తదితర గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం గ్రామాల్లోని మకానాల వద్ద పీర్లసరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఓ వైపు వర్షం పడుతున్నా భక్తులు మఖానాలకు చేరుకుని పీర్లస్వాములకు బాసికాలు, వెండి గొడుగులు, దట్టీలు సమర్పించి పూజలు చేసుకున్నారు.

● జూపాడుబంగ్లా: మొహరం వేడుకల్లో భాగంగా సోమవారం పగలుసరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాటిపాడు, 80బన్నూరు, మండ్లెం, తంగడంచ, తరిగోపుల, తర్తూరు, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లో కొలువుదీరిన పీర్ల హసన్, హుసేన్‌ల ఊరేగింపు సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.


గాజులపల్లెలో పీర్ల గ్రామోత్సవం

పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలి

శ్రీశైలంటెంపుల్: యాంపిథియేటర్ పరిసరాలు పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఆదేశించారు. సోమవారం పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా ఔటర్‌రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాలు, యాంపిథియేటర్, సారంగధర మఠం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టుపక్కల పిచ్చిమొక్కలను, బండరాళ్లను తదితర వ్యర్థాలను తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. యాంపిథియేటర్ వద్ద ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను, వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. సారంగధరమఠం వద్ద వర్షపు నీటితో పాటు కొట్టుకువచ్చే వ్యర్థాలు, గుండాలలో కలవకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, డీఈఈ పి.చంద్రశేఖరశాస్త్రి, ఏఈలు ఉన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ

తహసీల్దార్ ఆఫీస్ సబార్డినేట్ మృతి

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆఫీసు సబార్డినేట్ చాంద్‌బాషా(55) గుండెపోటుతో సోమవారం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. ఈనెల 12న మధ్యాహ్నం విధుల్లో ఉన్న చాంద్‌బాషా తనకు గుండెనొప్పిగా ఉందని సిబ్బందితో చెప్పడంతో వారు విషయాన్ని కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులు పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం చేయించి నందికొట్కూరు సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతిచెందినట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య మాలాన్‌బీతో పాటు ముగ్గురు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు.

30 ఏళ్ల తర్వాత మొహర్రం

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రంలో 30 ఏళ్ల తర్వాత మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. అనివార్య కారణాల వల్ల ఆగిపోయిన పీర్ల పండుగను పలువురు యువకులు కమిటీగా ఏర్పడి వేడుకలు పునరుద్ధరిస్తుండటంతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. మఖానంలో హజ్రత్ ఇమామ్ ఖాసీం, హజ్రత్ హుస్సేన్ ఆలయం, హజ్రత్ ఆలీ అక్బర్ పీర్లస్వాములను పూలమాలలు, బాసికాలతో ప్రత్యేకంగా అలంకరించారు.